క్లుప్తంగా

ధ్వంసమైన అంబులెన్స్



ఐనవోలు: ఇటీవల మండలానికి కేటాయించిన 108 అంబులెన్స్ ధ్వంసమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం మండలంలోని పున్నేలు క్రాస్ నుంచి వరంగల్–ఖమ్మం రహదారి వర్ధన్నపేట వైపుకు అంబులెన్స్ వెళ్తుంది. ఈ క్రమంలో వరంగల్ నుంచి వర్ధన్నపేటకు వెళ్తున్న లారీ అంబులెన్స్‌ను ఎడమ వైపుకు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. అయితే 108 వాహనం ముందుబాగం దెబ్బతినడంతో మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వద్ద నిలిపివేశారు. మండలంలో అత్యవసర సేవలకు విఘాతం కలిగే అవకాశం ఉండటంతో తక్షణమే అంబులెన్స్‌కు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



ఐనవోలు: విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని నందనం గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. బాధితురాలు పిడుగు రాజమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకు వద్ద రాత్రి 7 గంటల ప్రాంతంలో ఆవు మంచినీళ్లు తాగుతున్న క్రమంలో పక్కనే ఉన్న విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో షాక్‌కు గురైన ఆవు అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధితురాలు తెలిపారు. ఆవు విలువ రూ. 30 వేలు ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు ఆదుకోవాలని కోరారు.

స్థల పరిశీలన



శాయంపేట : మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అడ్డుగా ఉండడంతో మరోచోటకు మార్చేందుకు విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు బుధవారం స్థలాన్ని పరిశీలించారు. ఏడీఈ దేవేందర్, ఏఈ రాజ్‌కుమార్ స్థానికులతో మాట్లాడారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు స్థానికులు ఎలాంటి అభ్యంతరాలు చెప్పలేదని వారు వెల్లడించారు.

నియామకం



మహబూబ్ పాషా

నడికూడ: ముస్లిం హక్కుల పోరాట సమితి విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా మండలంలోని కౌకొండ గ్రామానికి చెందిన మహమ్మద్ మహబూబ్‌పాషాను నియమించినట్లు తెలంగాణ ముస్లిం హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మహ్మమద్ ఫయాజుద్దీన్ వెల్లడించారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు మహబూబ్‌పాషా కృతజ్ఞతలు తెలిపారు.

యాదవ మహాసభ అధ్యక్షుడిగా రమేష్



రమేష్ యాదవ్

కమలాపూర్ : యాదవ మహాసభ హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని గూడూరుకు చెందిన వంగ రమేష్ యాదవ్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు కురాకుల నాగభూషణంయాదవ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత 20 ఏళ్లుగా రమేష్ యాదవ్ చేస్తున్న సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యేలు జయపాల్‌యాదవ్, బొల్లం మల్లయ్యయాదవ్, బమ్మిడి శ్రీనివాస్ యాదవ్, కుడా చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్‌లకు రమేష్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. రాజన్న యాదవ్, పాక చంద్రమౌళి యాదవ్, బొజ్జ రవీందర్ యాదవ్, సాంబయ్య యాదవ్ తదితరులు అభినందించారు.

అనాథాశ్రమంలో వేడుక



శాయంపేట : స్థానిక సర్పంచ్ కందగట్ల రవి తన జన్మదిన వేడుకలను బుధవారం హనుమకొండలోని అతిథి దివ్యాంగుల అనాథాశ్రమంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. వారికి భోజన వసతి సమకూర్చారు. దివ్యాంగుల మధ్యన జన్మదినం జరుపుకోవడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. సర్పంచ్‌ను ఆశ్రమ నిర్వాహకులు , పలువురు అభినందించారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



మల్లక్‌పేట చెరువు కట్టను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు



కామారెడ్డిపల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి

పరకాల: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి విమర్శించారు. భారీ వర్షాలతో ఇసుక మేటలు వేసిన పంట పొలాలను బుధవారం ఆయన ఆ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. పంటపొలాలు, చెరువుకట్టల మరమ్మతులు చేయడంతో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. పరకాల, నడికూడ మండలాల్లో 700 ఎకరాల్లో పంటలు దెబ్బతిందని, బాధిత రైతులకు ఇప్పటి వరకూ ఆర్థిక సాయం అందించలేదని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే తన సొంత సంస్థ చల్లా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో నాణ్యతలేని పనులు చేపట్టి దోచుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. పరకాల రూరల్, నడికూడ మండల అధ్యక్షులు పుట్ట రవీందర్‌రెడ్డి, గోగుల రాజిరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎర్ర రామన్న, నాయకులు దుబాసి వెంకటస్వామి, దివాకర్, గోనెల కోటేశ్వర్ పాల్గొన్నారు.

మరోసారి మోసం చేసేందుకే..

ఎన్నికలు సమీపిస్తున్న కారణంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాల పేరుతో ప్రజలకు మరోసారి మోసం చేసేందుకు కుట్ర పన్నుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విజయ్‌చందర్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని కామారెడ్డిపల్లిలో బుధవారం పల్లెబాట–బస్తీబాట నిర్వహించారు. ప్రభుత్వం గృహలక్ష్మి పథకం పేరుతో ప్రజలను మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. బీసీబంధు, మైనారిటీబంధులు ఎంతమందికి అమలు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ప్రభుత్వానికి నిరుపేదల సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే గృహలక్ష్మి, బీసీ బంధుకు దరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్కరికీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు పుట్ట రవీందర్, మండల ఇన్‌చార్జ్ ఎర్రం రామన్న, నాయకులు కాసగాని రాజ్‌కుమార్, చిర్ర చక్రపాణి, జన్ను లింగయ్య, మహేందర్‌రెడ్డి, కాసగాని సాయికుమార్ పాల్గొన్నారు.

కాల్వలు, రోడ్డు నిర్మించాలి

మురుగునీరుతో పడుతున్న ఇబ్బందులే కాకుండా వరద ముంపునకు గురవుతున్న వికాస్‌నగర్‌లో కాల్వలు, రోడ్ల నిర్మాణం చేపట్టాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవునూరి మేఘనాథ్ కోరారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. పాత సీఎంఎస్ గోదాం నుంచి నాగులకుంట వరకు ఉండాల్సిన కాల్వ ఆక్రమణకు గురైందన్నారు. అదే విధంగా కొప్పుల రోడ్డు నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో రోడ్డు మార్గాన ఉన్న ఆర్యవైశ్య, ముదిరాజ్, ఉప్పరి, నాయీబ్రాహ్మణ శ్మశాన వాటికలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. తక్షణమే కాల్వ పనులు, రోడ్డు పనులు చేపట్టాలని లేని పక్షంలో 4వ వార్డు ప్రజల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. నాయకులు కాచం గురుప్రసాద్, నాగెల్లి రంజిత్, ఆకుతోట రాకేష్, సాయిసాగర్, వరప్రసాద్ పాల్గొన్నారు.

మొరం దందాపై చర్య తీసుకోవాలి



మొరం తవ్విన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఐనవోలు: మొరం అక్రమ దందాపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ నాయకులతో కలిసి బుధవారం నందనం, రాంనగర్ గ్రామాల్లో పర్యటించారు. నందనం రెవెన్యూ పరిధి గ్రామమైన రాంనగర్ గుట్ట నుంచి కొంతమంది అక్రమార్కులు ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్నారన్నారు. 2017 సంవత్సరంలో కొంతమంది రాజకీయ నాయకుల పలుకుబడితో మైనింగ్, రెవెన్యూ అధికారుల అండదండలతో గుట్ట భూమిని కొందరు అక్రమంగా పట్టా పొందారని అన్నారు. అక్రమార్కులు జేసీబీలతో తవ్వకాలు చేపట్టి రాత్రి వేళల్లో టిప్పర్ల ద్వారా వరంగల్‌కు తరలిస్తున్నారని అన్నారు. అధికారులకు ముడుపులు ముట్టడంతో చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ దృష్టి సారించి చర్య తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఆయన వెంట యూత్ నాయకులు దోమకొండ హరీష్, స్థానిక రైతులు, యువకులు, ఆ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

‘ఉత్తములకు’ ఘన సన్మానం



ఎంపీపీ, సర్పంచ్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఐనవోలు: మండలంలో ఉత్తమ సేవలందించిన సందర్భంగా స్వాతంత్ర్య వేడుకల్లో ప్రశంసపత్రాలు అందుకున్న వారికి బుధవారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంపీపీ మార్నేని మధుమతి, పున్నేలు సర్పంచ్ కత్తి దేవేందర్‌కు హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రశంసపత్రం అందించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతుబంధు సమితి సభ్యులు, సొసైటీ డైరక్టర్‌లు, సమన్వయ కమిటీ సభ్యులు, బీఆర్‌ఎస్ పార్టీ మండల, గ్రామశాఖ నాయకులు మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉత్తమ సేవలందించిన ఎంపీపీ మార్నేని మధుమతి, సర్పంచ్ కత్తి దేవేందర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. మండలానికి మరిన్ని సేవలు అందించాలని వారు కోరారు. ప్రజాప్రతినిధులు ఎంపీపీ, సర్పంచ్‌లను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, మండల రైతు బంధు సమితి కో ఆర్డినేటర్ మునిగాల సంపత్ కుమార్, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఉస్మాన్ అలీ, ఆత్మ కమిటీ జిల్లా డైరక్టర్ పొన్నాల రాజు, సొసైటీ వైస్ చైర్మన్ చందర్‌రావు, మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి, కార్యదర్శి రాజశేఖర్, అధికార ప్రతినిధి రవీందర్ పాల్గొన్నారు.

జనం గుండెల్లో నిలిచిపోనున్న ‘గద్దర్’



గద్దర్‌ను స్మరించుకుంటూ పాట పాడతున్న కళాకారులు



మాట్లాడుతున్న ఓంటేరు రాజమౌళి

పరకాల: తెలంగాణ సాయుధ పోరాటం నుంచి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన వరకు ప్రజా యుద్ధనౌక గద్దర్ చేసిన పోరాటం తరతరాలకు గుర్తుండిపోతుందని న్యాయవాద జాక్ చైర్మన్ ఓంటేరు రాజమౌళి అన్నారు. అలాంటి గొప్ప ఉద్యమకారుడు లేరన్న విషయాన్ని యావత్తు తెలంగాణ ప్రజలు తట్టుకోలేకపోతున్నారని తెలిపారు. జానపద కళాకారుల ఆధ్వర్యంలో పట్టణంలోని అమరధామంలో బుధవారం స్వర్గీయ గద్దర్ సంతాప సభ నిర్వహించగా కళాకారులు గద్దర్‌ను స్మరించుకుంటూ పాటలు పాడారు. అదే విధంగా కోర్టులోని బార్ అసోసియేషన్ కార్యాలయ ఆవరణంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో భాగంగా ధూం..ధాం కార్యక్రమాలతో తెలంగాణ ప్రజలను చైతన్యవంతులను చేయడంలో గద్దర్ పోషించినపాత్ర గొప్పదని బార్ అసోసియేషన్ సభ్యులు కొనియాడారు. ఒకదశలో గద్దర్ ఆటపాటలతోనే యావత్తు కళాకారులు ఏకమయ్యారని, స్వర్గీయ గద్దర్ ఉద్యమానికి జీవం పోశారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మేరుగు శ్రీనివాస్, పి.వీ రమణ, రాజు, సురేష్‌కుమార్, బొట్ల సుధాకర్, భిక్షపతి, పృథ్వీరాజ్, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీడీఎంఏను కలిసిన నగర మేయర్

వరంగల్ అర్బన్: రాష్ట్ర పురపాలక శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ పమేలా సత్పతిని నగర మేయర్ గుండు సుధారాణి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

ఆత్మకూరులో కొండెంగ హల్‌చల్



ఓ ఇంటి వద్ద ఉన్న కొండెంగ

ఆత్మకూరు: మండల కేంద్రంలో కొంతకాలంగా సంచరిస్తున్న కొండెంగ ప్రజలను పరేషాన్ చేస్తోంది. పాతబస్టాండ్ ఏరియాలోని ద్విచక్ర వాహదారులను గాయపరుస్తోంది. దీంతో ప్రయాణికులు అటువైపు వెళ్లేందుకు జంకుతున్నారు. ఇప్పటి వరకు దాదాపు పది మందిని గాయపర్చినట్లు స్థానికులు తెలిపారు. స్థానిక టీ పాయింట్‌ల్లోకి వెళ్లి డబ్బులను సైతం తినేసిందని చిరువ్యాపారులు వాపోతున్నారు. అధికారులకు మొరపెట్టుకున్నా లాభం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి కొండెంగను అడవిలో వదిలేయాలని స్థానికులు కోరతున్నారు.

చెరువుకట్ట గండ్లు వెంటనే పూడ్చాలి



గుడి చెరువు కట్టను పరిశీలిస్తున్న నాయకులు

శాయంపేట : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పలు చెరువుకట్టలకు పడిన గండ్లను వెంటనే పూడ్చాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దకోడెపాక గుడిచెరువుకట్టను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెద్దకోడెపాకలోని గుడిచెరువుకట్టకు గండ్లు పడి శిథిలావస్థకు చేరిందన్నారు. 20 రోజులు కావస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు గండ్లను పూడ్చలేదన్నారు. చెరువు ఆయకట్ట కింద 800 ఎకరాల్లో వరినాట్లు వేస్తున్నారని, మళ్లీ వర్షాలు పడితే కట్టకు గండి పడి నీరు వృథాగా పోతుందని, దాంతో రైతులు వేసుకున్న పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. వెంటనే గండ్లను పూడ్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వైనాల కుమారస్వామి, చిందం రవి, మారెపల్లి రవీందర్, నిమ్మల రమేష్, తడక కుమారస్వామి, రఫీ, రాజ్‌కుమార్, శ్రీనివాస్, చంద్రమౌళి, తిరుపతి, సుకుమార్, రాజేందర్, రవిపాల్, ప్రపంచరెడ్డి, జగన్, పత్తి శ్రీను, కట్టయ్య, శంకర్ పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీటీ భద్రునాయక్

శాయంపేట : 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు ఓటురుగా నమోదు చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ భద్రునాయక్ కోరారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రెండో స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమంలో భాగంగా బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 21వ తేదీన కొత్త ఓటరు జాబితా ప్రచురించబడుతుందని తెలిపారు. అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ నెల 26, 28 వ తేదీలతో పాటు సెప్టెంబర్ 2, 3 వ తేదీల్లో ఓటరు నమోదు కోసం స్పెషల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆఐలు శరత్‌కుమార్, హుస్సెన్, బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

27 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



పీడీఎస్ బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

శాయంపేట : అనుమతులు లేకుండా ఇంటిలో నిల్వ ఉంచిన 27 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆర్ఐలు శరత్‌కుమార్, హుస్సెన్‌లు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం వారు వివరాలు వెల్లడించారు. మండల కేంద్రంలోని రేషన్ డీలర్ తేజావతి తమ స్వంత ఇంట్లో రేషన్ బియ్యం నిల్వ చేయగా తమకు సమాచారం వచ్చిందన్నారు. డీటీ భద్రునాయక్ ఆదేశాల దాడులు చేసినట్లు తెలిపారు. రేషన్‌షాపులో ఉంచాల్సిన బియ్యం బస్తాలను అధికారుల అనుమతులు లేకుండా ఇంట్లో నిల్వ చేసిన 54 బియ్యం బస్తాలనను సీజ్ చేసి సివిల్ సప్లై అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. అనుమతులు లేకుండా పీడీఎఫ్ బియ్యం నిల్వ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అటెండర్ సంపత్, వీఆర్‌ఏ సురేష్ ఉన్నారు.

ప్రజా సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వం లక్ష్యం



అప్పయ్యపల్లెలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

శాయంపేట : ప్రజా సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యమని ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి అన్నారు. మండలంలోని ప్రగతిసింగారం, అప్పయ్యపల్లె, నేరేడుపల్లె గ్రామాల్లో బుధవారం ఇంటింటికీ సంక్షేమ ఫలాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమంపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి వహిస్తున్నారని అన్నారు. నిరుపేదలకు ఆసరా పింఛన్‌లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు శ్రీకారం చుట్టిన ఏకైక ప్రభుత్వం బీఆర్‌ఎస్ అన్నారు. త్వరలో బీసీ కార్పొరేషన్ రుణాలు, గృహలక్ష్మి పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. త్వరలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ భారీ మెజారిటీతో గెలుపొంది అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు పోతు సుమలతరమణారెడ్డి, రఘుసాల సంజీవరావు, ఆకుతోట రాజేష్, పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ క్షమాపణ చెప్పాలి

శాయంపేట : మందకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పెంబర్తి భరత్‌చంద్ర డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ఎస్సీ వర్గీకరణ ఎందుకు చేయలేదో రేవంత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. మందకృష్ణపై తప్పుడు ఆరోపణలు చేస్తే రానున్న రోజుల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. పెంబర్తి శ్రీనివాస్, నాగరాజు, సారయ్య, మొగిలి, ఐలయ్య, సాంబయ్య పాల్గొన్నారు.

‘గృహలక్ష్మి’ దరఖాస్తుల పరిశీలన



ఆత్మకూరులో సర్వే చేస్తున్న కార్యదర్శి

ఐనవోలు: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను గుర్తించేందుకు అధికారులు మండల వ్యాప్తంగా సర్వే చేపట్టారు. బుధవారం ఎంపీడీఓ వెంకటరమణ ఆధ్వర్యంలో ఐనవోలు, కక్కిరాలపల్లి తదితర గ్రామాల్లో అధికారులు పర్యటించి దరఖాస్తుల దారుల పూర్తి వివరాలను సేకరించారు. ఇప్పటి వరకు 2200 దరఖాస్తుల విచారణ పూర్తయిందని ఎంపీడీఓ వెల్లడించారు. మిగిలిన 1400 దరఖాస్తులను రెండు రోజుల్లో పూర్తి చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న గృహలక్ష్మి సర్వే

ఆత్మకూరు: మండలంలో గృహలక్ష్మి పథకం దరఖాస్తుదారుల సర్వే బుధవారం కొనసాగింది. అధికారులు దరఖాస్తుదారుల ఇంటి వద్దకు వెళ్లి పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

సీఐకి సన్మానం



సీఐని సన్మానిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఆత్మకూరు: సీఐగా బాధ్యతలు స్వీకరించిన రవిరాజును బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు. బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం జిల్లా ప్రధానకార్యదర్శి అర్షం మధుకర్, చల్లా యువసేన నాయకుడు వేల్పుల గణేష్, బీఆర్‌ఎస్ యువజన నాయకులు కొమ్ముల సురేష్, నమిండ్ల రాజ్‌కుమార్, నల్ల మహేష్, కమలాకర్ తదితరులు సన్మానించిన వారిలోఉన్నారు.

సీఐని కలిసిన ఎంపీపీ



సీఐకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీపీ

శాయంపేట : రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన మల్లేష్‌ను ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్క అందించారు. రాంశెట్టి లక్ష్మారెడ్డి, ఆకుతోట సమ్మిరెడ్డి, మడికొండ కుమార్, బొమ్మెన రమేష్, మామిడి అశోక్ తదితరులు ఉన్నారు.